క్లుప్తంగా

మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

శాఖ జిల్లా అధికారి పూర్ణిమ



మత్స్యశాఖ అధికారికి మొక్క అందజేస్తున్న మహేందర్‌ముదిరాజ్, మత్స్యకారులు

మొయినాబాద్‌రూరల్: మత్స్యకార సంఘం సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మత్స్యశాఖ జిల్లా అధికారి పూర్ణిమ అన్నారు. మంగళవారం మండలంలోని మత్స్యకార సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీ జిల్లా మత్స్యకార చైర్మన్ బాకారం మహేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో జిల్లా అధికారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా మత్స్యకారులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభల జిల్లా అధ్యక్షుడు బైరమోనీ మల్లేశ్‌ముదిరాజ్, వివిధ గ్రామాల మత్స్యకారులు మంచిరేవుల శ్రీరాములు, కృష్ణ ముదిరాజ్, గుండు సురేశ్, బైరమోనీ సతీశ్, కావలి రమేశ్, పూల మల్లేశ్, అశోక్, శ్రీకాంత్, చాకలి యాదగిరి, మహేందర్ పాల్గొన్నారు.

ఎంపీలను కలిసిన బీజేపీ నేతలు



ఎంపీలతో బీజేపీ నేతలు

షాద్‌నగర్: ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో మంగళవారం బీజేపీ ఎంపీలను షాద్‌నగర్ నేతలు కలిశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా వారు మెదక్, చేవెళ్ల, ఆదిలాబాద్ ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేశ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీలను కలిసిన వారిలో నాయకులు వంశీకృష్ణ, అక్కల రామన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సర్వేకు సహకరించని సర్వర్



గుర్రంపల్లిలో సర్వర్ రాక గోడపై నిలబడి చూస్తున్న అధికారులు

కొందుర్గు: ప్రభుత్వం మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వెళ్లి వారి ఇంటి చిత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. కానీ మొదటిరోజు సర్వర్ సహకరించకపోవడంతో సర్వే ముందుకు సాగలేదు. చాలా గ్రామాల్లో మొదటిరోజు సర్వర్ మొరాయించడంతో సర్వే పనులు ప్రారంభం కాలేదు. సర్వర్ ఇలాగే మొరాయిస్తే ప్రభుత్వం అనుకున్నట్లు ఈ నెల చివరివరకు సర్వే పూర్తయ్యేది అసాధ్యమేనని అధికారులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సర్వే గడువును పొడిగించాలని కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు అనుకూలంగా ఉండాలి



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

కొందుర్గు: ఓటర్లకు ఇబ్బంది కలగకుండా, అనుకూలంగా ఉండేలా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లి పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ సందర్శించి ఓటరు జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, నాయకులు ఆంజనేయులు, దస్తగిరి, నర్సింలు, కార్యదర్శి వివేక్‌వర్ధన్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొత్తూరు: ఆధ్యాత్మికత అలవర్చుకునే వారికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణానికి చెందిన వంశీగౌడ్ కొత్తూరులో నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

- 19వ తేదీ నుంచి షాబాద్ పహిల్వాన్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు
- జాతరకు హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు

షాబాద్: షాబాద్ ప్రాంత వాసుల ఆరాధ్య దైవం పహిల్వాన్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలు వారం పాటు కొనసాగుతాయని ఉర్సు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. 19వ తేదీ గురువారం గంధం కార్యక్రమంలో భాగంగా రాత్రి పది గంటలకు మల్కీబావి సమీపంలో ఉన్న దర్గా నుంచి గంధం భారీగా ఊరేగింపు జరుగుతుంది. 20వ తేదీ శుక్రవారం చిరాగాన్ (దీపారధన), కవ్వాలీ, 21వ తేదీ శనివారం వీనాబజార్ జరుగుతుందన్నారు. 22, 23వ తేదీల్లో పరిసరాల్లో ఉన్న పహిల్వాన్ చెరువు కట్టపై ఉన్న దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని చెప్పారు. 24వ తేదీన హైదరాబాద్‌కు చెందిన ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అందులో మహిళలు ప్రత్యేక పార్థనలతో పాటు పాటలు పాడుతారు. 25వ తేదీన గుల్బార్గాకు చెందిన బందం ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. 26, 27, 28వ తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు కులమతాలకతీతంగా ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

దర్గా చరిత్ర..

షాబాద్ ప్రాంతంలో పహిల్వాన్ షావలి సజీవ సమాధి కావడంతో ఈ దర్గాకు పహిల్వాన్ షావలి దర్గాగా పేరు వచ్చింది. సుమారు 420 ఏళ్ల చరిత్ర ఈ దర్గా సొంతం. ఆ కాలంలో షాబాద్ ప్రాంతం దట్టమైన అడవిగా ఉండేదని చరిత్ర ద్వారా తెలుస్తోంది. అయితే నిజాం వంశానికి చెందిన మాలిక్ షా కుష్టువ్యాధి గ్రస్తుడై మనస్థాపంతో అడవుల పాలయ్యాడు. అడవిలో తిరుగుతూ షాబాద్ ప్రాంతంలోని ప్రస్తుత చెరువు గట్టుపైన పహిల్వాన్ షావలి దర్గా సమీపంలోని రావి వృక్షం కింద సేద తీరగా.. మాలిక్‌షాకు కలలో దివ్యస్వరూపుడు ఒకరు వచ్చి సమీపంలోని మల్కీబావిలోని నీటిని తాగి చెరువు పక్కనే ఉన్న ప్రస్తుత పహిల్వాన్ షావలి దర్గా వద్ద రావిచెట్టు కింద ప్రార్థన చేయాలని సూచించాడు. దీంతో మాలిక్‌షా అదే విధంగా చేసి వ్యాధి నుంచి విముక్తి పొంది నిజాం వారసత్వంలో ఉన్నత స్థానాన్ని పొందారు. వెంటనే మాలిక్‌షా షాబాద్ గ్రామంలో దర్గా నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి నేటివరకు ఈ ప్రాంతంలోని అన్ని మతాల వారు సమైక్యంగా ప్రార్థనలు, పూజలు నిర్వహిస్తూ పహిల్వాన్ షావలి అనుగ్రహం పొందుతున్నారు. ఈ ఉత్సవాలకు షాబాద్ మండల ప్రజలే కాకుండా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో తరలివస్తారు.



ముస్తాబైన పహిల్వాన్ షావలి దర్గా



దర్గా ముఖద్వారం

ఏర్పాట్లు పూర్తి

వారంరోజుల పాటు జరిగే షాబాద్ పహిల్వాన్ షావలి ఉర్సు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దర్గా నిర్వాహక కమిటీ సభ్యులు తౌఫిక్, మజీద్, సత్తార్, ఇస్మాయిల్, సలీం, తాజ్, ముజీబ్, సత్తార్ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ దర్గాకు రంగులు వేసి అందమైన విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు. షాద్‌నగర్, మెహిదీపట్నం, రాజేంద్రనగర్ తదితర డిపోలకు చెందిన బస్సులు అరగంటకు ఒక బస్సు వస్తుంది. చేవెళ్ల, షాద్‌నగర్‌ల నుంచి షాబాద్‌కు ప్రత్యేకంగా బస్సులు నడిపించనున్నారు. ఉత్సవాలకు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి హాజరవుతున్నట్లు ముస్లింలు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా షాబాద్ సీఐ కాంతారెడ్డి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి

- ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ అపర్ణ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పోతుగల్, ముద్దెంగూడ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీరోజు ఇందిరమ్మ ఇళ్ల సర్వే నివేదికలను ప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో సమర్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం క్షేత్రస్థాయిలో పక్కా సమాచారం సేకరించాలని సర్వే సిబ్బందికి సూచించారు. మండల వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఇళ్ల సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. అర్హులైన వారి జాబితాను సక్రమంగా సిద్ధం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, తదితరులు ఉన్నారు.

పూర్తి వివరాలు సేకరించాలి

మొయినాబాద్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారం, చందానగర్, అప్పోజీగూడ, చిలుకూరు గ్రామాల్లో ఆమె ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో పూర్తి వివరాలను పొందుపర్చాలన్నారు. సర్వేకోసం పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ఇళ్లకు వచ్చినప్పుడు పూర్తి సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించాలని సూచించారు.



పోతుగల్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అపర్ణ

అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాలను ఆపలేరు

పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్, శ్రీకాంత్

చేవెళ్ల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్, శ్రీకాంత్ అన్నారు. చేవెళ్లలో మంగళవారం తమ సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలిపేందుకు వెళ్తున్న పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్‌లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని అడుగుతున్న పీడీఎస్‌యూ నాయకులను అరెస్ట్‌లు చేయడం సరైందికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వసతి గృహాల్లో సరైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో అశోక్, ప్రభాస్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఏబీవీపీ మహాసభలను జయప్రదం చేయండి

చేవెళ్ల: వ్యక్తి నిర్మాణం ద్వారానే జాతీయ పునర్నిర్మాణం సాధ్యం అనే ఉద్దేశంతో పనిచేస్తున్న సంస్థ ఏబీవీపీ అని ఆ సంఘం చేవెళ్ల నగర కార్యదర్శి కె.మహిపాల్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ కళాశాల ఎదుట ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ ఎదిగిందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 23, 24, 25వ తేదీలలో సిద్దిపేటలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల ముందస్తు అరెస్టు



మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద కార్మికులు

కొందుర్గు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీపీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ పిలుపుమేరకు మంగళవారం జీపీ వర్కర్లు చలో హైదరాబాద్ కార్యక్రమానికి సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా కొందుర్గు పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సీఐటీయూ మండల కన్వీనర్ రాయికంటి గోపాల్, కార్మికులు అమృతమ్మ, రవి, భాగ్యమ్మ, సత్యమ్మ, ప్రవీన్, మంజుల, రామచంద్రయ్య, జయమ్మ ఉన్నారు.

మొయినాబాద్: సమస్యల పరిష్కారం కోసం మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు వెళ్లకుండా పోలీసులు ఉదయమే వారి ఇళ్ల వద్దకు వెళ్లి ముందస్తు అరెస్టు చేశారు. మధ్యాహ్నం వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో కార్మికులు రత్నం, ఆంజనేయులుగౌడ్, మాణిక్యం తదితరులు ఉన్నారు.

హామీలు అమలు చేయాలి

కేశంపేట: తమ డిమాండ్ల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా జీపీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో రాంచంద్రయ్య, రవి, భిక్షమయ్య, పాండు ఉన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

సామాజిక తనిఖీ ప్రిసైడింగ్ అధికారి నరేందర్‌రెడ్డి

కొత్తూరు: ఉపాధిహామీ పనుల పట్ల సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని సామాజిక తనిఖీ ప్రిసైడింగ్ అధికారి నరేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో ఈ నెల 9 నుంచి 16వ తేదీవరకు 12 గ్రామ పంచాయతీల్లో గ్రామసభల ద్వారా సేకరించిన వివరాలను ఆయన వెల్లడించారు. రోడ్ల పక్కన మొక్కల పెంపకం, నర్సరీల నిర్వహణ, ఇంకుడుగుంతలతో పాటు ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన పనులపై సిబ్బంది తనిఖీలు చేసినట్లు తెలిపారు. కాగా తనిఖీల్లో చాలాచోట్ల మొక్కలు చనిపోవడం, ఇంకుడు గుంతలు సక్రమంగా లేకపోవడం, ఒకరికి బదులుగా మరొకరికి డబ్బులు జమచేసినట్లు క్షేత్రస్థాయిలో తనిఖీ అధికారులు గుర్తించినట్లు వివరించారు. ముఖ్యంగా పంచాయతీల్లో ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా ఉపాధిహామీ పనుల్లో జరిగిన అవకతవకలపై పూర్తి వివరాలను మండల పరిషత్ అధికారులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ సునీతామూర్తి, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఎంపీడీఓ అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఆర్డీఓ సరిత

షాద్‌నగర్: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆర్డీఓ సరిత అన్నారు. మంగళవారం పెన్షనర్స్ డే సందర్భంగా పట్టణంలోని పెన్షనర్ల భవనంలో పెన్షనర్లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీఓ హాజరై మాట్లాడుతూ.. పెన్షనర్లు అందరితో కలిసిమెలసి సుఖసంతోషాలతో జీవించాలన్నారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వానికి నివేదించి పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. పెన్షనర్ల సంఘం షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి పెన్షన్ తమ హక్కు అన్నారు. తాను చేసిన సేవా కాలానికి గుర్తింపుగా పెన్షన్ చిన్న పురస్కారమన్నారు. దీనిని ఏ ప్రభుత్వం నిషేధించడానికి వీలు లేకుండా సుప్రీం కోర్టులో కేసు వేసి పెన్షనర్లకు 1982లో పెన్షన్ వచ్చే విధంగా సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. అప్పటి నుంచి డిసెంబర్‌లో పెన్షనర్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్లను సన్మానించారు. పెన్షనర్లు ఆర్డీఓ సరితను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్ధన్, పాండు, శంకర్, సత్యనారాయణ, నాగేశ్, నర్సింలు, షబ్బీర్, అబ్దుల్ గఫార్, స్వరాజ్‌బాబు, జనార్ధన్, పాండు, శంకర్, సత్యనారాయణ, గోపాలస్వామి, గోపాల్‌రావు, రమాదేవి, గిరిజ, అంజు, మాణిక్యం, విష్ణుగౌడ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓను సత్కరిస్తున్న పెన్షనర్లు

సమస్యల పరిష్కారానికి పోరాటం

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ నిరంతరం ముందుండి పోరాడుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద మంగళవారం ఎంఈఓ ఎల్.పురన్‌దాస్‌తో కలిసి నూతనంగా డీఎస్సీ 2024 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు సర్వీస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు ఐడీ నెంబర్, ప్రాన్ నెంబర్ ఇప్పించటంలో మండల శాఖ కృషి చేసిందన్నారు. తమ సంఘం ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలపై పోరాటం చేసి పరిష్కరించామన్నారు. చైల్డ్ కేర్ లీవ్స్, 5 ప్రత్యేక సెలవులు సాధించటం ఇలా 50 ఏళ్లుగా అనేక జీవోలను ఇప్పించిన ఘనత పీఆర్టీయూదేనన్నారు. నూతన ఉపాధ్యాయులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు జయకృష్ణ, బలరాం, కృష్ణ, ప్రకాశ్‌రెడ్డి, దర్శన్‌గౌడ్, జిల్లా నాయకుడు వినోద్, మండల నాయకులు కృష్ణ, నరేందర్‌రెడ్డి, దయానంద్, రాజశేఖర్, నర్సింహారెడ్డి,జాన్సన్,శివకుమార్, సంగీత, అనిత, రవీందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శంకర్, రాంచంద్రయ్య, బాలాజీ, అనసూయ తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులకు సర్వీస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

నియామకం

షాబాద్: ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు యువత నడుం బిగించాలని ప్రజాచైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాచైతన్య సమితి యూత్ మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామానికి చెందిన క్యామ సాయిని నియమించి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాచైతన్య సమితి మండల కార్యదర్శి గడిల విఠలయ్య, నాయకులు ఉన్నారు.

Lost of Certificate

I, E VENKATESH S/o E MALLAIAH, R/o H.No: 11-55, Yellampally Village, Farooqnagar Mandal, Ranga Reddy Dist.T.G., I have lost my orginal Degree Probisional certificate near Xerox shop center Shadnagar busstand, on 14-12-2024. If anyone found please contact to me on: 9553332724

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్: రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ రైతులందరికీ కాలేదన్నారు. అదే విధంగా రైతులు వినియోగించే 15 సంవత్సరాలు దాటిన ట్రాక్టర్ ట్రాలీని స్క్రాబ్‌గా మార్చాలన్న ఆర్‌టీఏ నిబంధనను సవరించాలన్నారు. ట్రాలీ నుంచి పొల్యూషన్ వచ్చే అవకాశం లేదన్నారు. ఈ విషయాలను అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్, నాయకులు సత్యనారాయణరెడ్డి, రామచంద్రయ్య, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెంటయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జగదీశ్, నర్సింహారెడ్డి, మల్లయ్య, నర్సింలు, చంద్రమౌళి, రామస్వామి తదితరులు ఉన్నారు.

సీపీఐకి వంద సంవత్సరాల చరిత్ర

- పార్టీ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల: దేశంలోనే వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ ఒక్కటేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో మంగళవారం సీపీఐ పార్టీ శతదినోత్సవం సందర్భంగా వారోత్సవాలు, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా పేదల సమస్యలపై పోరాటం చేస్తూ వారికి అండగా నిలబడుతుందన్నారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల కోసం పనిచేసే పార్టీని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



కందవాడలో సీపీఐ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి జంగయ్య, నాయకులు

రైతులపై కేసులను ఎత్తివేయాలి

- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- లగచర్ల ఘటనపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన
- రైతులను విడుదల చేయాలని అంబేడ్కర్ విగ్రహాలకు వినతి

షాద్‌నగర్: లగచర్ల రైతులపై ప్రభుత్వం పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, జైల్లో ఉన్న రైతులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో ఆ పార్టీ నేతలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమాయకులైన గిరిజన రైతులపై ప్రభుత్వం తప్పులు కేసులను నమోదు చేయించి జైలుకి పంపించారని, అన్నం పెట్టే రైతన్నలను జైళ్లకు పంపడం సరికాదన్నారు. జైళ్లకు పంపిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌యాదవ్, నారాయణరెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, నట్‌రాజన్ పాల్గొన్నారు.



షాద్‌నగర్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

రాష్ట్రంలో అరాచకపాలన

మొయినాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి ఆరోపించారు. రైతులను జైలులో పెట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొత్త మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.



చేవెళ్లలో నిరసన తెలుపుతున్న నాయకులు

దాడులు సరికాదు

చేవెళ్ల: లగచర్ల రైతుల సంఘటనకు నిరసగా మండల కేంద్రంలో మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి వినపతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభాకర్,నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.